క్లుప్తంగా

అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి



భూ రికార్డులు పరిశీలిస్తున్న జేసీ విద్యాధరి

బంగారుపాళెం: రెవెన్యూ సదస్సులు, రీ సర్వే గ్రామ సభల్లో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం సాయంత్రం జేసీ తనిఖీ చేశారు. భూ సమస్యలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలపై ఆరాతీశారు. ఆమె మాట్లాడుతూ, సమస్యలపై క్షేత్ర స్థాయిలో అర్జీదారులను స్వయంగా కలసి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ భవాని, తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, డీటీ కల్యాణి, మండల సర్వేయర్ లావణ్య, ఆర్ఐ మధుసూదన్ పాల్గొన్నారు.

ఇంటి వద్దనే మెరుగైన వైద్యం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ చంద్రమహేష్

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ఇంటివద్దనే మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు ప్రాథమిక వైద్యాధికారి చంద్రమహేష్ అన్నారు. మండలంలోని చిత్తపార గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటివద్ద మంచాన పడ్డ రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సంధ్య, హేమలత, చంద్రశేఖర్, మంజుల, ఇందుమతి పాల్గొన్నారు.

అలరించిన గజ్జపూజ నృత్య ప్రదర్శన



చిన్నారిని అభినందిస్తున్న నిర్వాహకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో మంగళవారం శ్రీరంజని నృత్యాలయ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శన అలరించింది. అందులో భాగంగా గజ్జ పూజ నృత్య ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా చెస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్ పాల్గొని, నృత్యంలో కూడా పిల్లలు రాణించి, భారతీయ కళలను గొప్పగా ప్రదర్శించారు అని చెప్పారు. చెస్‌తో పాటు నృత్య ప్రదర్శనలో పాల్గొన్న వర్షిణిని ఆయన అభినందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

బంగారుపాళెం: ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ క్యాలెండర్‌ను మంగళవారం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించినట్లు జిల్లా అధ్యక్షులు వెంకటేశులు తెలిపారు. గ్రామ సచివాలయ ఉద్యోగుల సమస్యలను గురించి కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వినయ్‌కుమార్, మండల అధ్యక్షుడు శరవణ్‌కుమార్, సంఘ నాయకులు భరత్, రూపేష్‌కుమార్ పాల్గొన్నారు.



చీలాపల్లెలో పనిచేస్తున్న ఉపాధి కూలీలు

మొగరాళ్లపల్లెలో పనిచేస్తున్న ఉపాధిహామీ కూలీలు



ఉపాధి కమిటీల ఊసేది?

- నియామకాలు చేపట్టని అధికారులు
- నష్టపోతున్న కూలీలు
- ఉపాధి పనుల్లో పెరుగుతున్న అక్రమాలు

గుడిపాల: ఉపాధి హామీ పథకంలో అక్రమాలు అరికట్టేందుకు ఏర్పాటు చేసిన కమిటీల ఊసేలేదు. గత ప్రభుత్వం పంచాయతీ స్థాయిలో ఉపాధి కమిటీలను ఏర్పాటుచేసింది. పనుల నిర్వహణలో పారదర్శకత పాటించేందుకు, కూలీలకు వందరోజుల పనిదినాలు కల్పించేందుకు పదిమందితో కమిటీలు నియమించాలని నిర్ణయించింది. ఈ మేరకు గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక జీఓను కూడా విడుదల చేసింది. అయితే చిత్తూరు నియోజకవర్గంలో కమిటీల జాడ కనిపించడం లేదు. దీంతో అక్రమాలు చోటు చేసుకోవడమే కాకుండా, ఇష్టారాజ్యంగా పనులు కల్పిస్తున్నారు. చిత్తూరు నియోజకవర్గంలో 10,686 జాబ్‌కార్డులు ఉన్నాయి. వీరిలో జనవరి నెలకు సంబంధించి కేవలం 950 మంది మాత్రమే పనులకు వెళ్తున్నారు.

కమిటీల విధులు

కమిటీలు ఆయా పంచాయతీల్లో జరుగుతున్న పనులను తనిఖీ చేయడంతో పాటు వాడుతున్న మెటీరియల్, కూలీలకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించాలి. అర్హులైన వారికి జాబ్‌కార్డులు అందేలా చర్యలు తీసుకుంటాయి. తనిఖీల్లో కనిపించిన లోపాలను గ్రామసభలో తెలియజేయాలి. పనులు నాణ్యంగా జరిగేలా చూడాలి. అయితే పాలకులు, ఉన్నతాధికారుల్లో చిత్తశుద్ధి కొరవడడంతో కమిటీల ఏర్పాటు కావడం లేదు. దీంతో కూలీలకు పనుల ప్రదేశంలో సౌకర్యాలు లేక, కూలితో పాటు న్యాయం జరగడం లేదు. ఇక పనుల్లో అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోతుంది.

కూటమి నాయకులదే హవా

నియోజకవర్గంలో పలు పంచాయతీల్లో పనులు చేసిన కూలీలకు వేతనాలు ఖాతాల్లో జమకావడం లేదు. ఇప్పటివరకు నియోజకవర్గంలో రూ.20 లక్షల వరకు కూలీలకు డబ్బులు రావాల్సి ఉంది. ఉన్నతాధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి నాయకులు వస్తున్న దినసరి కూలీల్లోనూ తమకు వాటాలివ్వాలంటూ ఫీల్డ్ అసిస్టెంట్లపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. కొన్ని గ్రామాల్లో 10 మంది ఉపాధి పనులు చేసినట్లయితే తెలుగుదేశం పార్టీ కార్యకర్త ఒకరిని అందులో చేర్చాలని ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఒత్తిడి తేవడంతో మస్టర్లలో పది మందికి బదులు 11మంది పనిచేసినట్లు చూపుతున్నారు. ఈ విషయాన్ని పనిచేసిన కూలీలకు చూపించరు. బిల్లులు మాత్రం కూలీల ఖాతాలో పడుతున్నాయి. డబ్బులు తక్కువగా వచ్చిందని అడిగితే ప్రభుత్వం నుంచి నేరుగా ఖాతాలోకి వస్తుందని అందులో తాము చేసేది ఏమి ఉండదని ఫీల్డ్‌అసిస్టెంట్‌లు చెప్పడంతో కూలీలు మౌనంగా వెళ్లిపోతున్నారు. ఇలా మండలంలో వేలాది రూపాయలు టీడీపీ కార్యకర్తల జేబులు నిండుతున్నాయి. అధికారులకు తెలిసినా కూడా పట్టించుకోవడం లేదు. ఈ విషయం కూలీలకు అస్సలు తెలియడం లేదు.

కమిటీలో సభ్యులు

పంచాయతీ స్థాయిలో నియమించే కమిటీలో సర్పంచ్, ఆరుగురు స్థానిక సభ్యులు, గ్రామ సంఘం ప్రతినిధి ఒకరు, శ్రమ శక్తి సంఘాల సభ్యులు ఇద్దరు ఉంటారు. కమిటీలో సగం మహిళలు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ జనాభా శాతం ఆధారంగా వారికి కూడా చోటు కల్పించాలి. కమిటీ ఆరునెలల పాటు బాధ్యతలు నిర్వహిస్తుంది.

ఉపాధిలో కూలి గిట్టుబాటు కావడం లేదు

ఉపాధికూలీ పనులకు వెళ్తే కూలి గిట్టుబాటు కావడం లేదు. రోజుకు రూ.200 నుంచి రూ.220 వరకు వస్తుంది. రైతుల పనులకు వెళితే రూ.350 వరకు ఇస్తున్నారు. ఏం గోల్‌మాల్ చేస్తున్నారో తెలియడం లేదు. అడిగితే పనిచేసినంత డబ్బులు వస్తుందని సమాధానం చెబుతున్నారు.

\- వేండ, ఉపాధి కూలీ

సౌకర్యాలు లేవు

ఉపాధి హామీలో పనులు చేసేచోట సౌకర్యాలు లేవు. గతంలో ఫస్ట్‌ఎయిడ్ బాక్స్‌లు, తాగునీరు, షామియానా ఉండేవి. ఇప్పుడు అటువంటివి లేవు. అడిగితే ప్రభుత్వం నుంచి నిధులు రాలేదని అందుకోసం ఇంటివద్ద నుంచే నీరు తెచ్చుకుంటున్నాం. కూలి డబ్బులు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. కూలి గిట్టుబాటు కాకపోవడంతో ఆదివారం రోజు కూడా పనులకు వెళ్తున్నాం.

\- కన్నయ్య, ఉపాధి కూలీ

నేడు విద్యుత్ గ్రీవెన్స్

చిత్తూరు కార్పొరేషన్: వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. స్థానిక గాంధీరోడ్డులోని ఈఈ కార్యాలయంలో చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల పరిధిలోని వినియోగదారుల సమస్యలు తెలపవచ్చన్నారు. సమస్యలను వినతిరూపంలో ఇవ్వాలని ఆయన వివరించారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళితులు

బంగారుపాళెం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మండల కేంద్రంలో మంగళవారం దళితులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. దళితులు మాట్లాడుతూ, ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణతో అన్నదమ్ములుగా మెలుగుతున్న మాల మాదిగల మధ్య చిచ్చుపెడుతోందని ధ్వజమెత్తారు. వర్గీకరణతో ఎస్సీలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందనే విషయాన్ని దళిత జాతి గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం చిత్తూరులో ఎస్సీ కమిషన్ సభ్యులను కలసి వర్గీకణకు వ్యతిరేకంగా వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో విశ్వనాథ్, సుధాకర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

ఐరాల: చిన్నారులు మంచి పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని నాంపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు. పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని తెలిపారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు జ్వరం, జలుబు, దగ్గు వంటి జబ్బులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. చిన్న పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



ర్యాలీ చేస్తున్న ఏబీవీపీ సంఘ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు రాఘవేంద్ర డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు మంగళవారం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏబీవీపీ 43వ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేసేందుకు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. రాష్ట్ర మహా సభల్లో విద్యారంగ సమస్యలపై తీర్మానం ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. చిత్తూరు బాగ్ కన్వీనర్ పవన్ మాట్లాడుతూ రాష్ట్ర మహాసభల్లో 40 ఏళ్లలోపు వయసు ఉండి సమాజ సేవ చేస్తున్న వారికి గౌరీశంకర్ యువ పురస్కార్ అందజేస్తారన్నారు. విద్యార్థుల పక్షాన ఉంటూ సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కార్యకర్త దర్శన్, తదితరులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ప్రీతారెడ్డి

తవణంపల్లె: మండలంలోని కె.పట్నంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను మంగళవారం అపోలో హాస్పిటల్ వైస్ చైర్మన్ ప్రీతారెడ్డి, అపోలో హాస్పిటల్స్ వైస్ ప్రెసిడెంట్ నరోత్తమరెడ్డి, టోటల్ హెల్త్ సీఈఓ రాంబాబు ప్రారంభించారు. అపోలో హాస్పిటల్స్ చైర్‌పర్సన్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి సౌజన్యంతో కె.పట్నంలో ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించడానికి రూ.20 లక్షల వ్యయంతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ప్రీతారెడ్డి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి ప్రజలకు మినరల్ వాటర్‌ను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్‌సుందర్‌రాయల్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీర జవాన్ కార్తీక్‌కు శ్రద్ధాంజలి



కార్తీక్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్

బంగారుపాళెం: జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాద ఎదురు కాల్పుల్లో వీరమరణం పొందిన కార్తీక్ కుటుంబ సభ్యులను మంగళవారం తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ పరామర్శించారు. ఎగువరాగిమానుపెంట గ్రామంలో జవాన్ తల్లిదండ్రులు సెల్వి, వరదరాజులు మండడి, సోదరుడు రాజేష్‌ను కలిసి ఓదార్చారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్తీక్ పార్థివదేహం బుధవారం తెల్లవారుజామున ఎగువరాగిమానుపెంట గ్రామానికి చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీహరి, ఆర్ఐ మధుసూదన్, సిబ్బంది పాల్గొన్నారు.



పూతలపట్టు : ఉన్నత పాఠశాలలో నివాళులర్పిస్తున్న విద్యార్థులు

వీర జవాన్‌కు నివాళి

పూతలపట్టు(కాణిపాకం): జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదుల మధ్య జరిగిన దాడుల్లో మృతి చెందిన వీర జవాన్ పంగల కార్తీక్‌కు పూతలపట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నివాళులర్పించారు. చిత్రపటానికి పూలమాలవేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సంతాపం వ్యక్తం చేశారు.



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

లెనిన్ ఆశయాల అమలుకు కృషి చేయాలి

చిత్తూరు కార్పొరేషన్: లెనిన్ ఆశయాల అమలుకు అందరూ తమవంతు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు తెలిపారు. లెనిన్ 101వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం స్థానిక లెనిన్‌నగర్‌లో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరులో లెనిన్ పేరున కాలనీ నిర్మించి కార్మికులకు నీడ కల్పించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్, నాయకులు జనార్దన్, మణి, గోపినాథ్, దాసరి చంద్ర, సత్యమూర్తి, కోమల, కవిత, లత, రోజా, కాంతమ్మ, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం కార్యాలయంలో..

స్థానిక సీపీఎం కార్యాలయంలో లెనిన్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు నివాళి అర్పించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గంగరాజు మాట్లాడారు. దోపిడీదారుల పాలన తీరుకు వ్యతిరేకంగా పేదల కోసం సోషలిజాన్ని స్థాపించిన గొప్ప వ్యక్తి లెనిన్ అన్నారు. ఈ సమావేశంలో నాయకులు బాలసుబ్రమణ్యం, దాము, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



లెనిన్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు



సీపీఎం కార్యాలయంలో శ్రద్ధాంజలి ఘటిస్తున్న జిల్లా కార్యదర్శి గంగరాజు

పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

బంగారుపాళెం: రైతులు పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పశుసంవర్థకశాఖ ఉపసంచాలకులు డాక్టర్ ఆరిఫ్, డాక్టర్ లక్ష్మి కోరారు. మండలంలోని మడుపోలూరు, మొగిలి, వేపనపల్లెలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరాలను నిర్వహించారు. వైద్యశిబిరంలో పశువులలో బాహ్య పరాన్న జీవుల నిర్మూలనకు మందులను పిచికారీ చేశారు. ఆవులు, దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను తాపించారు. పాడిపశువులను పరీక్షించి వైద్యం చేశారు. వారు మాట్లాడుతూ, పాడిపశువులకు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వరం, గొంతువాపు, ముక్కులో నుంచి చీమిడి కారడం తదితర లక్షణాలు ఉంటే వెంటనే పశువైద్యాధికారులను సంప్రదించి చికిత్స చేయించాలన్నారు. కార్యక్రమంలో బంగారుపాళెం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు ఆసీఫ్, నలగాంపల్లె పశువైద్యాధికారి ఝాన్సీ, సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలకు స్పందన

గుడిపాల: పాడి రైతులు ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గుడిపాల పశువైద్యాధికారులు సాయిసుధ, రవితేజ కోరారు. మంగళవారం మండలంలోని వెప్పాలమానుచేను, గొల్లమడుగులో నిర్వహించిన పశు వైద్య శిబిరాలకు మంచి స్పందన లభించింది. శిబిరంలో 364 పశువులకు చికిత్స చేశారు. వారు మాట్లాడుతూ, గర్భకోశ వ్యాధులకు చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు పంపిణీ, పశువుల వ్యాధి నిర్ధారణ పరీక్షలతో పాటు పాడి రైతులకు పశువులపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది జ్యోత్స్న, రవి, పాండురంగయ్య, అబ్దుల్లా, కిషోర్, శివ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



బంగారుపాళెం: పడుపోలూరులో దూడకు నట్టల నివారణ మందు తాపిస్తున్న పశువైద్యాధికారులు

పశువైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

ఐరాల: ఉచిత పశువైద్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశుసంవర్ధకశాఖ ఏడీ పద్మావతి పిలుపునిచ్చారు. మండలంలోని గుండ్లపల్లె, వేదగిరివారిపల్లె గ్రామాల్లో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరాలను నిర్వహించారు. ఏడీ ఆధ్వర్యంలో సిబ్బంది రెండు బృందాలుగా పర్యటించి, రెండు గ్రామాల్లో 400 పశువులకు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు కరుణాకర్, రమేష్, పశు పోషకులు పాల్గొన్నారు.



వెప్పాలమానుచేనులో పాడిపశువులకు పిడుదుల నివారణ మందు స్ప్రే చేస్తున్న డాక్టర్



పాడి ఆవుకు వైద్య పరీక్షలు చేస్తున్న ఏడీ పద్మావతి



వెప్పాలమానుచేనులో పశువులకు డీవార్మింగ్ మాత్రలు వేస్తున్న దృశ్యం

అర్ధగిరిలో డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి



ప్రతాప్ సి.రెడ్డికి తీర్థప్రసాదాలను అందజేస్తున్న ఈఓ హనుమంతురావు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానాన్ని మంగళవారం అపోలో హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు అర్ధగిరి ఈఓ హనుమంతురావు ఘన స్వాగతం పలికారు. డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి వీరాంజనేయ స్వామికి అభిషేకం, పూజలు, అర్చనలు చేయించి మొక్కులు చెల్లించుకున్నారు. డాక్టర్ ప్రతాప్ సి రెడ్డిని కుటుంబ సభ్యులను ఆలయ మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. ఆలయ ఈఓ హనుమంతురావు ఆయనకు స్వామి శేష వస్త్రాలను, స్వామి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు.